# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట





సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అధికారులు

### ప్రభుత్వ కార్యాలయాల్లో

## ఈఆఫీస్ సిస్టమ్...

**అధికారికంగా కార్యాలయాల్లో ఏ ఉత్తర ప్రత్యుత్తరాలు అయినా**

**ఈఆఫీస్ ద్వారానే జరగాలి; జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, జూన్ 29, ప్రభాతవార్త :** వనపర్తి జిల్లాలో ఆయా ప్రభుత్వ కార్యాలయ మధ్య జరిగే అన్నింరకాలైన ఉత్తర ప్రత్యుత్తరాలు ఈఆఫీస్ ద్వారా మాత్రమే జరగాలని అందుకు తగ్గట్టు అన్ని కార్యాలయాల అధికారులు, సిబ్బంది తగిన శిక్షణ తీసుకొని సమాయత్తం కావాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం ప్రజావాణి హాల్లో ఈఆఫీస్ పై అధికారులకు అవగాహన కల్పించారు. ఫైళ్ళ సత్వర పరిష్కారం, పారదర్శకత, జవాబుదారీతనం కొరకు ఈఆఫీస్ చాలా – మిగతా4లో..

## రెండు చుక్కలు శ్రీరామ రక్ష

**బాధ్యతాయుతంగా ప్రతి ఒక్కరూ పోలియో**

**చుక్కలు వేయించాలి : దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

**దేవరకద్ర, జూన్ 29 ప్రభాతవార్త:** ఐదేళ్ల లోపు చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు రెండు చుక్కల పోలియో డ్రాప్స్ శ్రీరామరక్ష అని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా దేవరకద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని, చిన్నారులకు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి – మిగతా4లో..

**వార్త స్పందన..**

### టౌన్ ప్లానింగ్ అధికారులకు

## షోకాజ్ నోటీసులు..


వార్త

ఇష్టారాజ్యం....!

టౌన్ ప్లానింగ్‌లో అక్రమాల తీరు...!!

**అక్రమ కట్టడాలపై 26న వార్త దినపత్రికలో ఇష్టారాజ్యం**

**అనే కథనానికి స్పందించిన ఉన్నతాధికారులు...**

**ఇప్పుడైనా అధికారుల తీరు మారుతుందా...?**

**తేలికగా తీసుకుంటారా..**

**అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న**

**యజమానులకు నోటీసులు జారీ..**

**పత్రికా ప్రతినిధులు సమాచారం అడుగుతే ఆర్టిప ద్వారా**

**సమాచారం తీసుకోవాలంటున్న కమిషనర్...**

**వనపర్తి, జూన్29, ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా కేంద్రంలో రోజురోజుకు విచ్చలవిడిగా అక్రమ కట్టడాలకు నిలయంగా మారుతుందని బాహాటంగా చర్చ నడుస్తోంది. అయితే ఇటీవల వార్త దినపత్రికలో ఈనెల 26న "ఇష్టారాజ్యం" అనే శీర్షిక ప్రచురితమైంది. రాసిన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. వరుసగా సెలవులు రావడంతో అధికారులకు కొంత ఊరట కలగడంతో – మిగతా4లో..

## నేడు జడ్చర్లకు కేటీఆర్



**నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం**

**పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి రావాలని పిలుపు**

**జడ్చర్ల, జూన్ 29, ప్రభాతవార్త:** జడ్చర్లకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం రానున్నారు. జడ్చర్ల పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో మాజీ మంత్రి డా. సి.లక్ష్మారెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, ఎస్ ఐ ఆర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై అవగాహన, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ పై బిఆర్ఎస్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తారు. ఈ సమావేశానికి జడ్చర్ల నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుండి బీఆర్ఎస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు, సభ్యత్వ నమోదు ఇంఛార్జులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనాయకులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, శ్రేణులు హాజరు కావాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు.

# రాష్ట్రాభివృద్ధికి విద్యుత్ రంగం కీలకం

**సోలార్ ఉత్పత్తిలో తెలంగాణ ముందం**

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**సిఎండి జితేష్ వి పాటిల్‌తో కలిసి**

**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**




సిఎండి జితేష్ వి.పాటిల్‌తో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, ప్రాజెక్ట్ డైరెక్టర్ శివాజీ, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 29 ప్రభాత వార్త:** రాష్ట్ర అభివృద్ధిలో విద్యుత్ రంగం కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్ నగరంలోని విద్యుత్ సౌధ, మెట్టుగడ్డలో రూ. 52.56 లక్షల వ్యయంతో నిర్మించనున్న విజిలెన్స్, ఏపీ టీఎస్పీఎస్ భవన నిర్మాణ పను లకు సిఎండి జితేష్ వి పాటిల్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వేగంగా పెరు గుతున్న పారిశ్రామికాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంద న్నారు. ముఖ్యమంత్రి విజన్‌కు అనుగుణంగా కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం, రోడ్ల అభివృద్ధి, పవర్ నెట్‌వర్క్ స్థిరీకరణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. మహబూబ్ నగర్ కార్పొరేషన్ పరిధిలో పరిశ్రమలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందన్నారు. ఐటి పార్క్ ప్రాంతంలో కొత్త పరిశ్రమలు స్థాపించబడుతున్నాయని, ముఖ్యంగా అమరరాజ కంపెనీ బ్యాటరీ తయారీ యూనిట్ ఏర్పాటవుతోందని, భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమలు వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గ పరిధిలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని హన్వాడ మండలం గొండ్యాల గ్రామంలో 133 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు భూములను గుర్తించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు త్వరలో ఉప ముఖ్యమంత్రి చేత శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే కొన్ని 33/11 కేవీ సబ్‌స్టేషన్లు పూర్తి కాగా, మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయని చెప్పారు. హైదరాబాద్ పరిసర హైవేలకు సమీపంలో ఉన్న పరిశ్రమలు తెలంగాణను పెట్టుబడుల కేంద్రంగా మార్చాయని, గత రెండున్నర సంవత్సరాల్లో లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చినట్లు తెలిపారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో తెలంగాణ దేశంలో ముందంజలో ఉందని, ఆధునిక సాంకేతికతతో విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థలను మరింత అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. మెడికల్ కాలేజ్ సమీపంలో నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ త్వరలో ప్రారంభం కానుందని, పాలమూరు యూనివర్సిటీ పరిధిలో కూడా విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అందుకు యూనివర్సిటీలో సబ్ స్టేషన్ నిర్మాణానికి యూనివర్సిటీ వారితో మాట్లాడి స్థలం కేటాయించుకుని, శంకుస్థాపన చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, ప్రాజెక్ట్ డైరెక్టర్ శివాజీ, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహా రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, ఎస్ఈ జి. భీమానాయక్, కార్పొరేటర్లు జ్యోతి, విట్టల్ రెడ్డి, తిరుమల వెంకటేష్, రమేష్ రెడ్డి, మేగ్యా నాయక్, ప్రశాంత్ , తాహెర్, నాయకులు జాజిమొగ్గ నర్సింహులు, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పెబ్బేర్ జాతీయ రహదారిపై

## ఆర్టీసీ బస్సు బోల్తా..

**అసిస్టెంట్ ఇంజనీర్ శివప్రసాద్ మృతి,**

**పలువురికి స్వల్ప గాయాలు**

**అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు,**

**ఎస్సై వెంకటేష్ గౌడ్‌లపై ప్రశంసలు**



క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

**పెబ్బేరు, జూన్ 29 ప్రభాతవార్త :** మంత్రాలయం నుంచి వనపర్తి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎన్‌హెచ్ 44పై పెబ్బేరు సమీపంలో బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. ఎస్సై వెంకటేష్ గౌడ్ కథనం ప్రకారం సోమవారం ఉదయం 8 గంటల సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. జాతీయ రహదారిపై నుండి వస్తున్న బస్సు బ్రేకులు ఫెయిల్ కావడంతో బస్సు డివైడర్ పైకెక్కి బోల్తా పడింది. ఆ సమయంలో బస్సులో 60 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తుంది.

**ప్రమాద స్థలంలోనే మకాం..** వివరాల్లోకి వెళ్తే.. పెబ్బేరు సమీపంలో బస్సు బోల్తా ప్రమాదం జరిగినట్లు సమాచారం అందిన వెంటనే ఎస్సై వెంకటేష్ గౌడ్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా సిబ్బందితో కలిసి స్పాట్‌కు చేరుకున్నారు. క్షతగాత్రుల – మిగతా4లో..

# హామీలు అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం

**బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్**



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ ఎస్..ప్రవీణ్ కుమార్

**గద్వాల జూన్ 29, ప్రభాతవార్త :** గద్వాల నియోజకవర్గంలో ర్యాలంపాడు, గట్టు ఎత్తిపోతల పథకం, నెట్టంపాడు ప్రాజెక్టులు గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన పనులు కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినాక, ప్రాజెక్టులపై ఉన్న మిగతా పెండింగ్ పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మొన్న గద్వాల పర్యటనలో భాగంగా నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టుల పరిస్థితిపై ఎందుకు సమాధానం చెప్పలేదని మండిపడ్డారు..కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి చిన్న కాలువలో చెట్ల వెలిసిన తొలగించని స్థితిలో ప్రభుత్వము ఉన్నదని విమర్శించారు..గద్వాల ప్రజల సాగు, తాగునీటి అవసరాలకు కీలకమైన ప్రాజెక్టుల పనులు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్నాయని, వాటి పూర్తి కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు...విద్య వ్యవస్థపై.... తెలంగాణ గురుకుల పాఠశాలల్లో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న కుంభకోణాలపై బీఆర్ఎస్ రాజీలేని పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. ఈ పోరాటం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం విద్యార్థులకు న్యాయం జరగాలన్నదేనని ఆయన తెలిపారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజే విద్యార్థులకు అవసరమైన నాణ్యమైన యూనిఫాంలు, పుస్తకాలు, ఇతర సామగ్రి అందించేవారని, నాసిరకం వస్తువులకు ఎలాంటి అవకాశం ఉండేదికాదని అన్నారు. ప్రస్తుతం కూడా గురుకుల విద్యార్థులందరికీ నాణ్యమైన వస్తువులు పారదర్శకంగా అందాలని, వారి భవిష్యత్తుతో ఎవరూ రాజీ పడకూడదన్నదే బీఆర్ఎస్ లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తెలిపారు. తన భద్రత తొలగింపు పై....రాష్ట్ర ప్రభుత్వం తన భద్రతను తగ్గించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. తానేమీ రాజకీయ లబ్ధి కోసం వచ్చిన వ్యక్తిని కాదని, 26 ఏండ్లు ఐపీఎస్ అధికారిగా దేశం కోసం ప్రాణాలు పణంగాపెట్టి పనిచేశానని, తనకు రాష్ట్రపతి శౌర్యపతకం కూడా వచ్చిందని గుర్తుచేశారు. తాను కాంగ్రెస్, టీడీపీ, బీఆర్ఎస్ హయాంలో ఆఫీసర్‌గా పనిచేశానని, ఏ ప్రభుత్వం కూడా తన భద్రతను తగ్గించలేదు కానీ, ఇప్పుడు కక్షపూరితంగా తన భద్రతను తగ్గించారని మండిపడ్డారు...నిత్యం ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూ ప్రభుత్వాన్ని ఎండగడుతున్నందుకే తనపై కాంగ్రెస్ సర్కార్ కక్ష సాధిస్తున్నదని ఆరోపించారు. తాను అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేకనే తన వ్యక్తిగత భద్రతను కుదించిందని మండిపడ్డారు. తన సెక్యూరిటీని తొలగించినా, తనను బెదిరించినా ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ఆపబోనని, ఎట్టిపరిస్థితుల్లోనూ బీఆర్ఎస్‌ను వీడనని స్పష్టం చేశారు. తన ప్రాణాలకు రేవంత్‌రెడ్డిదే బాధ్యతని హెచ్చరిం చారు.

ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పద్మ వెంకటేశ్వర రెడ్డి, నాగర్ దొడ్డి వెంకట్రాములు, జి.రాఘవేంద్ర రెడ్డి, అంగడి బసవరాజ్, ఆతుకూరి రెహమాన్, కౌన్సిలర్ చంటన్న, కురవ పల్లయ్య, చిన్నపాడు ఆంజనేయులు, మోనేష్, గంజిపేట రాజు, చక్రిధర్ రెడ్డి, ఆటో టవర్ ముక్బాల్, తిమ్మప్ప గౌడ్, వెంకటేష్ నాయుడు, నూర్ పాషా, శ్రీరాములు, ముని మోర్య, ఇద్దుం గోవిందు, కావాలి గోపి, గాజుల కృష్ణారెడ్డి, డ్యామ్ శ్రీను, సామెలు, ఇంజన్న, మాలిక్, రాము, రమేష్, తిమ్మప్ప, కృష్ణ, మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### మూఢనమ్మకంతో

## దారుణ హత్య..

**- 48 గంటల్లోనే నిందితుడి అరెస్ట్.....**

**రిమాండ్ తరలింపు - సీఐ భీమ్ కుమార్**



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ భీమ్‌కుమార్

**కల్వకుర్తి, జూన్ 29 ప్రభాతవార్త:** ఊర్కొండ మండలంలోని రేవల్లి శివారులో చోటుచేసుకున్న ఎర్రోల్ల యాదయ్య హత్య కేసును పోలీసులు 48గంటల్లోనే ఛేదించారు. ఈదారుణానికి పాల్పడిన నిందితుడిని అరెస్టుచేసి, రిమాండ్‌కు తరలించినట్లు కల్వకుర్తి సీఐ భీమ్ కుమార్ తెలిపారు. రేవల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు అనే వ్యక్తి, అదే గ్రామానికిచెందిన ఎర్రోల్ల యాదయ్యను ఈనెల26న కత్తితోదాడి చేసి హత్యచేసి నిందితుడు పరారయ్యాడు. ఈఘటన పై – మిగతా4లో..

### వివాహేతర

## సంబంధానికి భర్త బలి...

**భర్తను కత్తితో నరికి చంపిన భార్య**



నాగేష్ (ఫైల్)

**దేవరకద్ర, జూన్ 29 ప్రభాతవార్త:** వివాహేతర సంబంధం పెట్టుకొని భర్తను భార్య హత్య చేసిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండల పరిధిలో చోటుచేసుకుంది. దేవరకద్ర ఎస్సై జి.భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దేవరకద్ర మండలం బస్వాయపల్లి గ్రామానికి చెందిన నాగేష్ (38)కి 17 ఏళ్ల క్రితం కోయిలకొండ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన కవితతో వివాహం జరిగింది. వారికి ముగ్గురు కుమారులు ఉన్నారు. రెండు సంవత్సరాల క్రితం నుండి మృతుడు నాగేష్ భార్య కవిత అక్రమ సంబంధం కొనసాగిస్తుంది. విషయం తెలిసిన నాగేష్ తన భార్య ప్రవర్తన మార్చుకోమని తరచూ గొడవ పడేవారు. అలాగే గొర్రెలు కాయడానికి పోకుండా తాగి వచ్చి కవితతో గొడవ పడేవాడు. రోజులాగే ఆదివారం రాత్రి 10:30గంటల సమయంలో మృతుడు నాగేష్ తాగి వచ్చి భార్య కవితతో గొడవ పడి ఆమెను కొట్టాడు. ఎలాగైనా భర్తను వదిలించుకోవాలనే ఉద్దేశంతో ఆమె కోపంతో నగేష్ చేతులు కట్టి ఇంట్లో ఉన్న కత్తితో మెడపై తలపై నరికింది. దీన్ని చూసిన మృతుడి కుమారులు రవి, రాములు కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చి మృతుడి తమ్ముడికి సమాచారం ఇచ్చారు. రక్తపు మడుగులో పడి ఉన్న నాగేష్ ను ఆయన తమ్ముడు ఆటోలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో 108 అంబులెన్స్ లో హైదరాబాదులోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున నాగేష్ మృతి చెందాడని మృతుడి తమ్ముడు రాజప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు దేవరకద్ర ఎస్సై జి.భాస్కర్ రెడ్డి తెలిపారు.

### ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక అమలులో

# జిల్లా పనితీరు ప్రశంసనీయం

- **ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక నిరంతర ప్రక్రియ**
- **ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకునేలా చూడాలి**
- **ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు అద్భుతంగా కొనసాగుతున్నాయి**
- **లబ్ధిదారుల ఆనందమే ఇందిరమ్మ పథకానికి నిదర్శనం**
- **ప్రజలకు నిరంతర సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం..**
- **ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా ప్రత్యేక అధికారి షఫీయుల్లా...**




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి, సంక్షేమ శాఖ కమిషనర్ షఫీయుల్లా

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 29 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలులో నాగర్‌కర్నూల్ జిల్లా రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన పనితీరును కనబరుస్తోందని జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి, సంక్షేమ శాఖ కమిషనర్ షఫీయుల్లా ప్రశంసించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను వేగంగా అందిస్తోందని ఆయన అన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ్ సహాయంలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ప్రత్యేక అధికారి షఫీయుల్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మరింత సమర్థవంతమైన పాలన అందించేందుకు, సంక్షేమ పథకాలను వేగంగా అమలు చేసేందుకు, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు రూపొందించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక ఎంతో వినూత్నమైన కార్యక్రమమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం పెరగడంతో పాటు ప్రజలకు సేవలు మరింత వేగంగా అందుతున్నాయని, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కింద జిల్లా వ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమాలను సమీక్షించిన అనంతరం తనకు ఎంతో సంతృప్తి కలిగిందని షఫీయుల్లా తెలిపారు. జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ నాయకత్వంలో జిల్లా అధికారులు సమష్టిగా పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారని కొనియాడారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ – మిగతా4లో..

## బొట్టు పెట్టి...హారతి పట్టి..

**ప్రభుత్వ విప్ యెన్నంకు ఆడబిడ్డల ఆత్మీయ స్వాగతం**

**ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల మోముల్లో సంతోషం..**

**హన్వాడ, జూన్ 29, ప్రభాతవార్త :** ప్రభుత్వ విప్ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నంశ్రీనివాస్‌రెడ్డికి ఆడబిడ్డలు ఆత్మీయస్వాగతం పలికారు. ఇల్లు లేక అవస్థలు పడుతున్న తమ పరిస్థితులను చూసి ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇల్లుమంజూరు చేయడంతో సోమవారం సంతోషంగా గృహప్రవేశాలు చేసుకున్నారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విప్ యెన్నం హాజరు కావడంతో అడుగడుగునా ఘన స్వాగతం పలికి బొట్టు పెట్టి హారతులు పట్టారు. ఈసందర్భంగా దాచేపల్లి గ్రామంలో మహిళలు వృద్ధులు ఎమ్మెల్యేను ఆత్మీయంగా పలకరించారు. కాసేపు వృద్దులు మహిళలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే మా ఎజెండా ప్రజలకు మౌలిక – మిగతా4లో..



విప్ కు స్వాగతం పలుకుతున్న మహిళలు

## ఆత్మకూరులో భారీ పోలీసు బందోబస్తు..

### ప్రత్యేక బెటాలియన్ కవాతు...


పెద్దమ్మ తల్లి పండుగ నేపథ్యంలో ప్రత్యేక బెటాలియన్ కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

**ఆత్మకూర్ జూన్ 29, ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో మంగళవారం జరపతల పెట్టిన పెద్దమ్మ తల్లి పండుగ నేపథ్యంలో ఆత్మకూరు పట్టణంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అనపర్తి పట్టణానికి చెందిన ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ఆత్మకూర్ పోలీసుల సహకారంతో పట్టణంలోని పుర వీధుల కుండా భారీ కవాతు నిర్వహిస్తూ పెద్దమ్మతల్లి పండుగ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆత్మకూరు సిఐ శివకుమార్ ఎస్సై జయన్న తదితరులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దాదాపు ఏడు దశాబ్దాల తర్వాత పట్టణంలో నిర్వహించనున్న పెద్దమ్మ తల్లి పండగ నిమిత్తం లక్షలాదిమంది ప్రజలు ఇతర ప్రాంతాల నుంచి రానున్న నేపథ్యంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లుగా సీఐ శివకుమార్ ప్రభాతవార్తకు తెలిపారు. పెద్దమ్మ తల్లి పండుగను ప్రజల ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకారాలు అందజేయాలని అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల సహకారం కూడా తీసుకుంటున్నట్లుగా ఆయన తెలిపారు. పెద్దమ్మ తల్లి గుడి ఆవరణలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందు జాగ్రత్తలు చేపట్టినట్లుగా సిఐ శివకుమార్ తెలిపారు.

## ఓటరు జాబితా ప్రక్షాళన పారదర్శకంగా నిర్వహించాలి:ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ


ఓటర్ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ

**అచ్చంపేట, జూన్,29 ప్రభాతవార్త:** ఓటరు జాబితా ప్రక్షాళన (ఎస్ఐఆర్) పారదర్శకంగా నిర్వహించాలని ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ సూచించారు. సోమవారం పట్టణంలో రెండవ వార్డు సాయినగర్ కాలనీలో నిర్వహిస్తున్న (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఓలు), బూత్‌లెవల్ ఏజెంట్లు (బిఎల్ఎలు), అలాగే ప్రజలకు పలు కీలకసూచనలు చేశారు. ఓటరుజాబితా ప్రక్షాళనను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదుకావాలని, అనర్హుల పేర్లను తొలగించే ప్రక్రియను నిష్పక్షపాతంగా చేపట్టాలని సూచించారు. ప్రజలు తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులకోసం సంబంధిత అధికారులను సంప్రదించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడూ తన ఓటు హక్కును కాపాడుకునేలా అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మురళి, గోపాల్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఖాదర్ పాషా, మాజీ కౌన్సిలర్ సుంకరి నిర్మల బాలరాజు, అధికారుకు బిఎల్ఏలు, నాయకులు కార్యకర్తలు కాలని ప్రజలు పాల్గొన్నారు.

## బాలానగర్‌లో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుపై అడిషనల్ కలెక్టర్ సమీక్ష


మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్

**బాలానగర్, జూన్ 29 ప్రభాతవార్త :** బాలానగర్ మండల కేంద్రంలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల నిమిత్తం తొలగించిన డా.బిఆర్. అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు చేయడానికి అనువైన స్థలం నిమిత్తం అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ అధికారులు, ఆర్‌అండ్‌బి అధికారులు, ప్రజా ప్రతినిధులు, కుల సంఘాల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులతో ఆయన సమావేశమయ్యారు. విగ్రహ ఏర్పాటుకు అనువైన స్థలం, అవసరమైన ప్రభుత్వ అనుమతులపై చర్చించారు. అన్ని వర్గాల అభిప్రాయాలను కలెక్టర్‌కి తెలియజేస్తామని, కలెక్టర్ తదుపరి ఆదేశాల మేరకు అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఆర్డీవో నవీన్ కుమార్, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో అనిల్ కుమార్ రెడ్డి, బాలానగర్ సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి దత్తాత్రేయ, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అంతయ్య ఆశయాలను కొనసాగిస్తాం

### సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ దేశ్య నాయక్ నాయక్


అంతయ్యకు నివాళులు అర్పిస్తున్న సిపిఎం నేతలు

**అచ్చంపేట,జూన్,29 ప్రభాతవార్త:** కామ్రేడ్ అంతయ్య ఆశయాలను కొనసాగిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎల్. దేశ్య నాయక్ అన్నారు. సోమవారం అచ్చంపేట మండలం సింగారం గ్రామంలో కామ్రేడ్స్ సాటు అంతయ్య 34వ వర్ధంతిని ఘనంగా నిర్వహించడం జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదలకోసం నిరంతరం పోరాడిన ఘనత అంతన్నకు మాత్రమే దక్కిందన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటంచేసిన యోధుడు అంతయాని కొనియాడారు. అచ్చంపేట నల్లమల్ల ప్రాంతానికి ఎర్రజెండాకి వన్నెతెచ్చిన గొప్ప వ్యక్తి అంతన్న అన్నారు. అచ్చంపేట మండలంలో అంచలంచలుగా ఎదుగుతున్న ఎర్రజెండా వీరుడు అంతన్నని ఓర్వలేని నక్సలైట్లు అంతనను హత్య చేయడం జరిగిందని గుర్తు చేశారు. కానీ ఆయన ఆశయాలను చంపలేరని వారు గుర్తు చేశారు. ఆయన ఆశయాలు కొనసాగించడానికి మనమందరం ప్రజా ఉద్యమాలు ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్ధం సైదులు గ్రామ కార్యదర్శి బక్కయ్య సీనియర్ కామ్రేడ్లు వెంకటయ్య, పర్వతాలు, బుచ్చయ్య, నరేష్, బుచ్చయ్య, నారాయణ రవి శ్రీను రైతు నాయకులు పర్వతాలు, సుందరయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.


## ఘనంగా ఏరువాక పండుగ వేడుకలు

### జట్కా పద్ధతిలో పోలమ్మ దేవతలకు మొక్కులు

**కెటిదొడ్డి జూన్ 29, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో ఏరువాక పౌర్ణమి పండుగ వేడుకలు సోమవారం రోజున ఘనంగా జరుపుకున్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభాన్ని సూచించే ఈ పండుగ సందర్భంగా, గ్రామంలోని శ్రీ పోలమ్మ దేవత చెంత రైతులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఇందులో భాగంగా హిందూ సంప్రదాయం ప్రకారం జట్కా పద్ధతిలో కోళ్లు పోలమ్మ అమ్మవారికి సమర్పించి, కోళ్లు కోయడం జరిగింది. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండి గ్రామం సుభిక్షంగా ఉండాలని, అలాగే పశుసంపద మరియు కోళ్ల వంటి జీవాలు ఎటువంటి రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా వృద్ధి చెందాలని రైతులందరికి ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో బీజేపీ కేటి దొడ్డి మండల ఓబీసీ ప్రెసిడెంట్ ముంగ్లీ వీరేష్, గ్రామ రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, ఏరువాక పౌర్ణమి ఉత్సాహంతో నూతన వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు.

## పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికై పనిచేయాలి

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాకరాజు శ్రీనివాస రావు


జిల్లా ప్రధాన న్యాయమూర్తికి పూల బొకే అందజేస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి, జూన్ 29, ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా నూతన జిల్లా న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన బాకరాజు శ్రీనివాసరావును జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు సునీతా రెడ్డి సోమవారం కోర్టు కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు పరస్పర సమన్వయంతో పని చేయాల్సిన అవసరంపై చర్చించారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులకు సంబంధించిన పోక్సో కేసుల విచారణను వేగవంతం చేసి, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు న్యాయవ్యవస్థ, పోలీసు శాఖ, జిల్లా యంత్రాంగం సమిష్టిగా పనిచేసి ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. న్యాయమూర్తులు, ఇతర పోలీసు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దాతల సహకారం అభినందనీయం

### ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థులకు బ్యాగులు పంపిణీ


ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

**ఉప్పునుంతల,జూన్29 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల ప్రాథమిక బాలుర, బాలికల పాఠశాల విద్యార్థులకు మర్యాద ఫౌండేషన్ వారి సౌజన్యంతో విద్యార్థులకు బ్యాగులను ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. సోమవారం బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన బ్యాగుల పంపిణీ కార్యక్రమానికి అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథి హాజరయ్యారు. సమావేశానికి ముందు ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామానికి చెందిన మర్యాద శ్రీనివాస్ రెడ్డి, మర్యాద రుక్మా రెడ్డి లు ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి అమెరికాలో స్థిరపడి సొంత గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు బ్యాగులు, బూట్లు పంపిణీ చేయడం అభినందనీయమని వారి సేవలు మరింత బల పరచాలని ఆయన ఆశించారు. తాను చదువుకున్న గ్రామంలో విద్యార్థులకు ఇలాంటి వస్తువులు అందించాలని వారు ఒక మంచి ఆలోచనతో ముందుకు రావడం గర్వించదగ్గ విషయమని భవిష్యత్తులో మరిన్ని సేవలందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మర్యాద ఫౌండేషన్ నిర్వాహకులు అందించిన సేవలు మరింత మంది ఆదర్శంగా తీసుకొని ముందు ముందు పాఠశాల విద్యార్థులకు మరెన్నో కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన కోరారు. ఈ పంపిణీ కార్యక్రమంలో టి పిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ తో పాటు మండల విద్యాశాఖాధికారి జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి, గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది కర్నే లక్ష్మీనారాయణ, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, తిప్పర్తి నరసింహారెడ్డి, మర్యాద ఫౌండేషన్ కోఆర్డినేటర్ కృష్ణారెడ్డి, ఆపాఠశాల హెచ్‌ఎంశ్రీనివాసులు, మార్కెట్ డైరెక్టర్ కృష్ణ, సింగిల్ విండోడైరెక్టర్ ఆలూరిశ్రీనివాసులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

**ఘనంగా సన్మానం...** మర్యాద పౌండేషన్ వారి సౌజన్యంతో విద్యార్థులకు బ్యాగుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ, మర్యాద ఫౌండేషన్ కోఆర్డినేటర్ కృష్ణారెడ్డి, వారి కుటుంబసభ్యులను పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

## నకిలీ విత్తన వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

### తాసిల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

**ఆత్మకూర్ జూన్ 29, ప్రభాతవార్త:** ఉమ్మడిజిల్లా వ్యాపితంగా రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులను విక్రయించి సొమ్ము చేసు కుంటున్న వ్యాపారస్తులపై కఠిన చర్యలు చేపట్టాలంటే సోమవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం ముందు అఖిలభారత రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి అఖిల భారత రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాజన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత వర్షాకాల సీజన్లో రైతులకు అవసరమైన మేర విత్తనాలు, ఎరువులను అందజేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని నకిలీ వ్యాపారస్తులపై ఉక్కు పాదం మోపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో కొనసాగుతున్న యూరియా యాప్ ను తక్షణమే రద్దు చేసి ఎరువుల డీలర్ల ద్వారానే నీరుగా రైతులకు యూరియా పంపిణీ చేసేందుకు చీరలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత కర్ఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా రైతులకు రైతు భరోసానిధులు విడుదల చేయకపోవడం ఎంతవరకు సమంజసమని అంతేకాకుండా గత శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన రెండు లక్షల రూపాయల రుణమాఫీని రైతులందరికీ వర్తింపజేసేలా తక్షణమే చీరలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు రైతులకు గిట్టుబాటు ధర అందించడమే కాకుండా రైతు పండించిన ప్రతి పంటకు బోనస్ చెల్లించే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు రూపొందించాలని రైతు శ్రేయస్సు కోసం ప్రభుత్వాలు సబ్సిడీ రూపంలోనే ఎరువులు, విత్తనాలు మరియు యాంత్రిక పరికరాలను సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. అనంతరం ఆత్మకూర్ తాసిల్దార్ జెకే మోహన్ కు సమస్యలతో కూడిన వివిధ పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వజ్ర భారత రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు, వాసారెడ్డి, రైతు సంఘం నాయకులు వెంకటన్న, రాజు, కురుమన్న, ఆంజనేయులు తదితరులతో పాటుగా పలువురు రైతులు పాల్గొన్నారు.

## బుద్దారం గ్రామస్థుల రాస్తారోకో..

### పెండింగ్ బిల్లులు, నష్టపరిహారం కోసం నిరసన


నిరసన తెలుపుతున్న బుద్దారం గ్రామస్తులు

**గోపాల్ పేట్ జూన్ 29 ప్రభాతవార్త :** బుద్దారం గ్రామంలో గ్రామస్థులు గురువారం చేపట్టిన రాస్తారోకో ఉద్రిక్తతకు దారితీసింది. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు ప్రధాన రహదారిపై నిరసన చేపట్టారు. ప్రధాన డిమాండ్లు : డబుల్ బెడ్రూమ్ ఇండ్ల బిల్లుల మంజూరు గత ప్రభుత్వం మూడు సంవత్సరాల క్రితం మంజూరు చేసిన 40 డబుల్ బెడ్రూమ్ ఇండ్లకు సంబంధించి బిల్లులు ఇంతవరకు అందలేదని నిరసనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం ఐడీ మరియు టోకెన్లను జనరేట్ చేసినప్పటికీ, బిల్లుల చెల్లింపులో తీవ్ర నిరక్ష్యంల వహిస్తోందని వారు ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్ల సమస్యలు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఐడీలు క్రియేట్ చేసినప్పటికీ, బిల్లుల మంజూరులో జాప్యం చేస్తూ నిరక్ష్యంల్లగా వ్యవహరిస్తోందని గ్రామస్థులు మండిపడ్డారు. ఈ ఇండ్లకు సంబంధించిన బిల్లులను వెంటనే మంజూరు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిజర్వాయర్ భూములకు నష్టపరిహారం బుద్దారం రిజర్వాయర్ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతులకు ఇచ్చే నష్టపరిహారాన్ని పెంచి అందించాలని నిరసనకారులు కోరారు. రాస్తారోకోలో పాల్గొన్న గ్రామస్థులు తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. వెంటనే అధికారులు స్పందించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, తక్షణమే బిల్లులను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శేఖర్ గౌడ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి


సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**దామరగిద్ద,జూన్29 ప్రభాతవార్త :** రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం దామరగిద్ద తహసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కోశాధికారి పెద్దింటి తాయప్ప మాట్లాడుతూ రైతులకు యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు సకాలంలో అందడం లేదని, బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతు భరోసా పంట పెట్టుబడి సాయం సీజన్ ప్రారంభానికి ముందే అందడం లేదని, గత బకాయిలు కూడా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సరిపడా వర్షాలు లేక పంటలు దెబ్బతింటున్నాయని, ప్రభుత్వం కొన్ని రకాల వరినే కొనుగోలు చేయకుండా రైతులు పండించిన అన్ని రకాల ధాన్యాన్ని కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)తో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తడి ధాన్యం పేరుతో క్వింటాలుకు 10 కిలోల వరకు కోత విధించడం రైతులకు అన్యాయమని, ఆ విధానాన్ని వెంటనే నిలిపివేయాలని కోరారు. అలాగే మొక్కజొన్న కొనుగోలు బకాయిలు, బోనస్‌ను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. యూరియా యాప్ ద్వారా బుకింగ్ విధానాన్ని రద్దు చేసి రైతులకు అవసరమైన మేర ఎరువులు అందించాలని, ఎరువుల ధరలను నియంత్రించాలని, రైతు భరోసా నిధులు సీజన్ ప్రారంభానికి ముందే విడుదల చేయాలని, అన్ని రకాల పంటలను ఎంఎస్‌పితో కొనుగోలు చేసి బోనస్ ఇవ్వడం ద్వారా పంట మార్పిడిని ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఉల్లిగుండం కిష్టారెడ్డి, తలారి రమేష్, కె.అంజి, బొమ్మన్‌పాడు నర్సిములు, రాజప్ప గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ సర్వేలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### మ్యాపింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

### అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ


ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

**ఉప్పునుంతల,జూన్ 29 ప్రభాతవార్త :** ప్రతి పౌరునికి ఓటు హక్కు ముఖ్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు ఉండే విధంగా బిఎల్‌ఏలు కృషి చేయాలని అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ సర్వే ఎన్యూమరేషన్ పంపిణీ కార్యక్రమాన్ని గ్రామాలలో నిర్వహిస్తున్న కార్యక్రమం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని, ఓటు అర్హత ఉన్న వారిని తొలగించకుండా బిఎల్‌ఏ లు జాగ్రత్తగా పని చేస్తూ బిఎల్‌ఓలకు సహకరించాలని ఆయన సూచించారు. 2002 సంవత్సరం ఓటర్ లిస్టులో ఉన్న వారి కుటుంబ సభ్యుల మ్యాపింగ్ ఆధారంగా ఎస్ఐఆర్ సర్వే నిర్వహించడం జరుగుతుందని ఆయన సూచించారు. గ్రామాలలో అర్హులైన వారి ఓటు తొలిగిపోకుండా జాగ్రత్తలు పాటించాలని బిఎల్ఎలకు, గ్రామస్తులకు సూచించారు. గ్రామాలలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ సర్వేతో గ్రామంలో నిజమైన ఓటు కలిగిన వారికి హక్కు లు ఉంటాయని ఎస్ఐఆర్, ఎన్యూమరేషన్ ఫారాలు పూర్తి జాగ్రత్తలు పాటించాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామంలో ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్న బిఎల్ఓ లకు బిఎల్ఏ లు సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ తో పాటు గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు, ఉప సర్పంచ్ అంతటి శైలజ వెంకటయ్యగౌడు, నాయకులు కట్ట అనంతరెడ్డి, తిప్పర్తి నరసింహారెడ్డి, తిప్పర్తి జగన్మోహన్ రెడ్డి, పాత్కుల రామచంద్రయ్య, కట్ట శ్రీనివాస్ రెడ్డి, అంతటి వెంకటయ్య గౌడ్, బిఎల్ఓ లు అప్పోజు పద్మ, పద్మ, సింగిల్ విండో డైరెక్టర్ ఆలూరి శ్రీనివాసులు, దేవదారి కుంట తండా మాజీ ఉప సర్పంచ్ జైపాల్ నాయక్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

### వరుణ దేవుడి కోసం

## రైతుల ప్రత్యేక పూజలు

**ఆత్మకూర్ జూన్29, ప్రభాతవార్త :** ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు పూర్తి కావస్తున్న సకాలంలో వర్షాలు కురువకపోవడంతో దిగాలు చెందిన రైతులు సోమవారం రోజు ఆత్మకూరు మండలంలోని జూరాల, గుంటిపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు కృష్ణానది నుంచి మీరు తెచ్చి ఆయా గ్రామాలలో దేవాలయాలలో గల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమై వర్షాలు కురువక పోవడంతో ఇప్పటికే రైతులు వేసుకున్న విత్తనాలు మొలకెత్తక పోవడం మూలంగా రైతులు తీవ్ర నష్టాలకు గురికావాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బాజా బజంత్రీలతో కృష్ణానదికి చేరుకొని కృష్ణా నదిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తెచ్చిన నీటితో దేవాలయాలలో అభిషేకం నిర్వహించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు నర్సింలు, లక్ష్మన్న తదితరులతో పాటుగా పలువురు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అమ్మవారికి వెండి కిరీటం వితరణ..

**ఆత్మకూర్ జూన్ 29, ప్రభాతవార్త:** పట్టణంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న పెద్దమ్మ తల్లి పండగ ఏర్పాటులో భాగంగా ఆత్మకూర్ పట్టణానికి చెందిన కాపర్తి గంగన్న శెట్టి కుమారులు 912 గ్రాముల వెండి కిరీటాన్ని బహుకరించారు. ఏడు దశాబ్దాల క్రితం నిర్వహించిన పెద్దమ్మతల్లి పండుగను ఆత్మకూరు పట్టణంలో మంగళవారం రోజు అత్యంత వైభవంగా నిర్వహించనున్న నేపథ్యంలో పట్టణానికి చెందిన పలువురు వ్యాపారులు ప్రముఖులు పెద్ద ఎత్తున విరాళాలు అందజేస్తుండగా కాపర్తి గంగన్న శెట్టి జ్ఞాపకార్థం వెండి కిరీటాన్ని ఆలయ కమిటీ అధ్యక్షులు మొగిలి శ్రీధర్ గౌడ్ నిర్వహణ కమిటీ సభ్యులకు సోమవారం రోజు అందజేశారు. పెద్దమ్మ తల్లి పండుగ దృశ్య వేద పండితుల చేత పెద్దమ్మ తల్లి విగ్రహానికి వెండి కిరీటాన్ని బహుకరించినట్లుగా ఆలయ కమిటీ అధ్యక్షులు ఎన్ శ్రీధర్ గౌడ్ ప్రభాతవార్తకు తెలిపారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


మల్లేష్ (ఫైల్)

**బాలానగర్, జూన్ 29 ప్రభాతవార్త :** గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బాలానగర్ మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామ శివారులో సోమవారం తెల్లవారు జామున జరిగింది. ఎస్సై నరేందర్ రెడ్డి వివరాల మేరకు.. మండలపరిధిలోని గుండేడుగ్రామానికి చెందిన మీసాల మల్లేష్ దిలీప్ రీ రోలింగ్ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సా యంత్రం డ్యూటీ ముగించుకున్నాక, వ్యక్తిగత అవసరాల నిమి త్తం కేతిరెడ్డిపల్లి గ్రామ శివారులో గల దాబా వద్దకు వచ్చి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీ కొట్టడంతో తలకు, ముఖానికి బలమైన గాయాలయ్యాయి. ఈ ఘటనలో మల్లేష్ అక్కడికక్కడే మృతి చెందగా, స్థానికులు అంబులెన్స్‌లో జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తన భర్త మృతికి కారణమైన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవా లని మృతుడి భార్య రజిత ఫిర్యాదు చేశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## స్కూటీ ఢీకొని బాలుడికి గాయాలు

**లింగాల,జూన్ 29,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన లింగాల లోని ఏకలవ్య చౌరస్తా వద్ద గుర్తుతెలియని స్కూటీ ఢీకొని 10 ఏళ్ల బాలుడు గాయపడ్డాడు. ఎస్ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం లింగాల గ్రామానికి చెందిన యశ్వంత్ తన అక్కతో కలిసి చెప్పులు కుట్టించేందుకు వెళ్తుండగా వేగంగా వచ్చిన స్కూటీ ఢీకొట్టి పరారైంది. ఈ ప్రమాదంలో బాలుడికి నోరు, గొంతు భాగాల్లో గాయాలయ్యాయి. తండ్రి గువ్వని నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

### రాంపూర్ సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి




స్టడీ మెటీరియలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి

**కోయిలకొండ జూన్ 29, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ,ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరాలని రాంపూర్ గ్రామ సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. సోమవారం ఆయన గ్రామంలోని ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ పాఠశాలల స్థాయిని పెంచారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులతో కూడిన విద్యను అందించడం జరుగుతుందన్నారు. ప్రైవేటు మోజులో పడి విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్ట వద్దని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చేరిన విద్యార్థులందరికీ సొంత నిధులతో పెన్నులు, పెన్సిల్స్, బుక్స్, వాటర్ బాటిల్స్ ఉచితంగా పంపిణీ చేశారు. విషయం తెలుసుకున్న మండల విద్యాశాఖ అధికారి మినహా జుద్దిన్ రాంపూర్ గ్రామ సర్పంచ్ గోవర్ధన్ రెడ్డికి విద్యాశాఖ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ అభినందించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### మెడికల్ క్యాంపులో రోగులకు

## పరీక్షలు చేసిన వాకిటి మానస


మెడికల్ క్యాంపులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**మక్తల్‌టౌన్, జూన్ 29 ప్రభాతవార్త:** బీకేఆర్ ఫౌండేషన్ అధినేత గవినోళ్ల బాలకృష్ణారెడ్డి జన్మదినం సందర్భంగా మక్తల్ మున్సిపాలిటీ గంజ్‌లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులో మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస స్వయంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసిన మానస తన అనుభవంతో పరీక్షలుచేసి వైద్యవృత్తిపై తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు. ప్రజాసేవలో బాలకృష్ణారెడ్డి ముందుంటారు. లక్షలు వెచ్చించి క్యాంపులు నిర్వహించడం గొప్ప విషయం. సేవాగుణంలో ఆయనకు సాటి ఎవరూ లేరు అని కొనియాడారు.

## ప్రతి బీఎల్ఓ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి


ఫారాల పంపిణీ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్

**వనపర్తి, జూన్ 29, (ప్రభాతవార్త):** సోమవారం వనపర్తిలోని 23వ వార్డులో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్) ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారుల (బీఎల్ఓలు) పనితీరును పరిశీలించిన కలెక్టర్, ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయడంతో పాటు, ఓటర్లకు ఫారాలను ఎలా సక్రమంగా పూరించాలో స్పష్టంగా వివరించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి సందేహాలు ఉన్నా ఓర్పుతో నివృత్తి చేసి, అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే, ఎన్యూమరేషన్ ప్రక్రియను పారదర్శకంగా, నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని బీఎల్ఓలకు సూచించారు. ఓటరు జాబితా ఖచ్చితత్వానికి ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియ ఎంతో కీలకమని, అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రమేష్ రెడ్డి, బిఎల్వో, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## సాంఘిక సంక్షేమ గురుకులాల్లో
## ఉపాధ్యాయ, అధ్యాపక ఖాళీల భర్తీ

**నారాయణ పేట, జూన్ 29 (ప్రభాతవార్త) :** నారాయణపేట జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో తాత్కాలిక ప్రాతిపదికన ఉపాధ్యాయ అధ్యాపక ఖాళీలను భర్తీ చేయనున్నట్లు జిల్లా సమన్వయ అధికారిణి బి. నాగమణి మాల తెలిపారు. అర్హత కలిగిన ఆసక్తి ఉన్న అభ్యర్థులు జూలై 1వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల, మరికల్ నందు దరఖాస్తులను సమర్పించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. డెమో తరగతులు జూలై 3వ తేదీన ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు నమోదు చేసుకున్న అభ్యర్థులు విద్యార్హత ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు జిరాక్స్ ప్రతులను వెంట తీసుకురావాలని పేర్కొన్నారు. బాలికల పాఠశాలలు, కళాశాలల్లో బోధించేందుకు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు బాలికల పాఠశాలలు, కళాశాలల్లో తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్, బయో సైన్స్, సోషల్, పీఈటీ, ఆర్ట్/క్రాఫ్ట్/మ్యూజిక్, లైబ్రేరియన్, హెల్త్ సూపర్వైజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అధ్యాపక పోస్టుల్లో తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఖాళీలను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. బాలుర పాఠశాలల్లో సోషల్, లైబ్రేరియన్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సమన్వయ అధికారి బి.నాగమణి మాల కోరారు.

## గ్రామస్తులకు ఆదర్శంగా నిలిచిన సర్పంచ్

**పాఠశాల అభివృద్ధికి సర్పంచ్ గౌరవ వేతనం విరాళం**

**మక్తల్ టౌన్, జూన్ 29 ప్రభాతవార్త:** మాద్వార్ గ్రామ పాఠశాల అభివృద్ధి కోసం తన ఐదు నెలల పది రోజుల జీతం రూ.34 వేలు విరాళంగా ఇచ్చి సర్పంచ్ డా. శ్రీనివాస్ రెడ్డి గొప్ప మనసు చాటుకున్నారు. సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభలో పాఠశాల అప్‌గ్రేడ్, 6, 7 తరగతుల ప్రారంభం, విద్యా వాలంటీర్ల నియామకంపై చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తన జీతాన్ని పాఠశాలకు అందజేస్తున్నట్లు ప్రకటించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్‌ను స్ఫూర్తిగా తీసుకుని సంతోష్ రెడ్డి, రాజేశ్వరరావు చెరో రూ.10,000, డాక్టర్ ఆశప్ప, గాళ్ల రాములు చెరో రూ.6,000, బొంకాయ శంకరప్ప, వడ్ల నర్సప్ప చెరో రూ.5,000 చొప్పున, యువకులు, వార్డు సభ్యులు రూ.2,000 నుంచి రూ.3,000 వరకు విరాళాలు ప్రకటించారు. మొత్తం రూ.1.10 లక్షల విరాళాలు వచ్చాయి. పిల్లల భవిష్యత్తు కోసం విద్యాభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తామని గ్రామస్తులు తెలిపారు. ఉపాధ్యాయులు గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపి, నాణ్యమైన విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామసభలో ఉప సర్పంచ్ కె.శివాని, రిటైర్డ్ హెచ్ఎం జగదీష్, మహిళా సంఘం అధ్యక్షురాలు కర్నే అంజమ్మ, వార్డు సభ్యులు, యువకులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జూలై 2 భూ పోరాటాన్ని విజయవంతం చేయండి

**తెలంగాణ రక్షణ సేన మక్తల్ నియోజకవర్గ ఇంచార్జి డీకేసీహెచ్ వెంకటన్న**

**మక్తల్ టౌన్, జూన్ 29 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలు, కళాకారులు, జర్నలిస్టులకు హైదరాబాద్ ఉప్పల్ బగాయత్‌లో 250 గజాల ఇళ్ల స్థలాలను వెంటనే కేటాయించాలని తెలంగాణ రక్షణ సేన మక్తల్ నియోజకవర్గ ఇంచార్జి డీకేసీహెచ్ వెంకటన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మక్తల్ లోని రోడ్డు, భవనాల అతిథి గృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని, కమిటీ పేరుతో కాలయాపన చేస్తూ ఉద్యమకారులను నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. ఉద్యమంతో సంబంధం లేని వారిని కమిటీలో చేర్చడం సరికాదని విమర్శించారు. జూలై 2న ఉప్పల్ బగాయత్‌లో టీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో జరిగే భూ పోరాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మక్తల్ నియోజకవర్గ ప్రజలు, ఉద్యమకారులు, యువత, మహిళలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో సీహెచ్ వెంకటరమణ, డా.యాంకి ఆచారి, బైగనపల్లి సంధ్యారాణి, సాకలి శ్రీనివాసులు, కురువ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి

**వెల్దండ, జూన్ 29 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని పెద్దాపూర్ గ్రామాన్ని రాష్ట్ర స్పెషల్ మైనార్టీ కమిషనర్ అండ్ అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ బి.షఫీ ఉల్లా నాగర్‌కర్నూల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీ దేవా సహాయం సందర్శించినారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కేశమల్ల అనుష కృష్ణ వారికి స్వాగతం పలికి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహిళా సంఘ భవనం ఇందిరమ్మ ఇండ్లు గ్రామంలో ఉన్నటువంటి సమస్యల గురించి సర్పంచ్‌తో పాటు మండల అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి వివిధ అధికారులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వం ఇస్తున్న ఆదేశాలను మండలంలోని అధికారులు ఎప్పటికప్పుడు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సులోచన, ఏపీఎం జయమాలిని, ఉపసర్పంచ్ ప్రసాద్ చారి, వార్డు సభ్యులు గ్రామ కార్యదర్శి ప్రజలు ఉన్నారు.

## మెప్మా ఆర్పీలకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలి

**అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన యూనియన్ నేతలు**

**నారాయణ పేట, జూన్ 29 ప్రభాతవార్త :** నారాయణ పేట పట్టణ మున్సిపల్ కేంద్రాల్లో మహిళా సంఘాల నిర్వహణకు సహాయపడుతున్న మెప్మా ఆర్పీలకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని తెలంగాణ మెప్మా ఆర్పీల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనుకి యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తున్న మెప్మా ఆర్పీలకు కనీస వేతనం అమలు చేయాలని కోరారు. ప్రస్తుతం ఇస్తున్న గౌరవ వేతనం కూడా ప్రతినెలా అందడం లేదని, ఆరు నెలలకు లేదా ఏడు నెలలకు ఒకసారి చెల్లిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఆర్పీలను బీఎల్ఓ విధుల నుంచి తప్పించాలని కోరారు తమ వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బండమీది బలరాం, తెలంగాణ మెప్మా ఆర్పీల యూనియన్ జిల్లా అధ్యక్షులు సౌభాగ్యలక్ష్మి, జ్యోతి, రాధాజీ, సుజాత, పి. లింగమ్మ, రమాదేవి, కవిత, నాగేంద్రమ్మ, శామమ్మ, మల్లేష్, జయంత్ రెడ్డి, చెన్నయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వడ్డేపల్లి మండల ఎంపీడీవోగా సుదర్శన్

**వడ్డేపల్లి, జూన్ 29 ప్రభాతవార్త :** వడ్డేపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా సుదర్శన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొత్తకోట మండలపంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న సుదర్శన్‌కి ప్రమోషన్ లభించడంతో వడ్డేపల్లి ఎంపీడీవోగా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయన కార్యాలయంలోని అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈసందర్భంగా కార్యాలయ సిబ్బంది నూతన ఎంపీడీవో సుదర్శన్ కి పూలమాల వేసి, శాలువాతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. నూతన ఎంపీడీవో మాట్లాడుతూ మండల అభివృద్ధికి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు అందరి సహకారంతో కృషి చేస్తానని, పారదర్శకంగా విధులు నిర్వహిస్తానని సుదర్శన్ తెలిపారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో బదిలీ అయిన ఎంపీడీవో రామకృష్ణ, ఏపీవో అనిల్ కుమార్, జులకల్ సర్పంచ్ హెచ్.రాజు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ ఇంటర్, ఎస్ఎస్సీ ప్రవేశాలు ప్రారంభం

**దామరగిద్ద, జూన్ 29 ప్రభాతవార్త:** 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ, హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ ఎస్ఎస్సీ, ఓపెన్ ఇంటర్మీడియట్ కోర్సుల ప్రవేశాలు సోమవారం నుంచి ప్రారంభమైనట్లు పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దామరగిద్ద అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ కె. సురేష్, అదనపు కోఆర్డినేటర్/ఇన్‌చార్జ్ ఎ. శంభులింగం సంయుక్త ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన, ఆసక్తి ఉన్న అభ్యర్థులు దామరగిద్దలోని అధ్యయన కేంద్రాన్ని సంప్రదించి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 94903 22492 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# పెంట్లవెల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మిక సందర్శన


గురుకులంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 29 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెంట్లవెల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థినులకు ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా, వసతి, పాఠ్యపుస్తకాలు, ఆహార సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పాఠశాల నిర్వహణ తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థినులతో నేరుగా మాట్లాడి బోధన, పాఠ్యాంశాల అవగాహన, ఉపాధ్యాయుల బోధనా విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ గదులు, వంటశాల, భోజనశాల, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, పరిశుభ్రత, విద్యుత్, భద్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థినికి కార్పొరేట్ స్థాయి విద్యతో పాటు అన్ని మౌలిక వసతులు అందించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్యార్థినుల ఆరోగ్యం, పరిశుభ్రత, పోషకాహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థినులకు ప్రతిరోజూ నాణ్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, మెనూ ప్రకారం భోజనం అందుతున్నదీ లేదో అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. కేజీబీవీ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచడంతో పాటు తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య సౌకర్యాలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థినిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారి విద్యా పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన విద్యా సహాయాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థినులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే పరిష్కరించే విధంగా అధికారులు స్పందించాలని, పాఠశాల నిర్వహణలో నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులపై సంబంధిత అధికారులతో చర్చించిన కలెక్టర్, లోపాలను వెంటనే గుర్తించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ విద్యాసంస్థలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. కాంపౌండ్ వాల్ నిర్మాణం పెండింగ్లో ఉందని ప్రత్యేక అధికారి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కాంపౌండ్ వాల్ నిర్మించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

## పియూలో బీపీఈడ్, ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ పరీక్షల నిర్వహణ


సెమిస్టర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

**మహబూబ్‌నగర్, జూన్ 29, ప్రభాతవార్త:** పాలమూరు విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న బీపీఈడ్ మొదటి సెమిస్టర్, 5వ సంవత్సరం ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ 8వ సెమిస్టర్ పరీక్షలు సోమవారం యూనివర్సిటీ పీజీ కళాశాలలో ప్రశాంత వాతావరణంలో కొనసాగాయి. ఈ సందర్భంగా యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. మధుసూదన్ రెడ్డి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసి, పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు సజావుగా నిర్వహించాలని, పరీక్షల సమయంలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. డా.డి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ పరీక్షల్లో ఎలాంటి కాపీయింగ్‌కు తావు లేకుండా ఇన్విజిలేటర్లు అప్రమత్తంగా వ్యవహరించి పారదర్శకంగా పరీక్షలను నిర్వహించాలని సూచించారు. విశ్వవిద్యాలయ పరీక్షల నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని తెలిపారు. అదేవిధంగా పాలమూరు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో బీ.ఫార్మసీ ఆరో సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పరీక్షల నియంత్రణ అధికారి డా.కె. ప్రవీణ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి, పరీక్షల నిర్వహణను పరిశీలించారు. విభాగధిపతి డా. వి. ప్రభాకర్ రెడ్డి, చీఫ్ సూపరింటెండెంట్ డా. సిహెచ్. రవికాంత్, పరీక్షల ఇంచార్జ్ డా.మహమ్మద్ గౌస్ మొహిద్దీన్, ఇన్విజిలేటర్స్ డా.ఎం. గాలెన్న, డా. ఆర్. చంద్రశేఖర్, డా.బి. సోమేశ్వర్, జి.కల్పన తదితరులు పర్యవేక్షించారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించుకోవాలి

**అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ**

**ఉప్పునుంతల, జూన్ 29 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పచ్చదనాన్ని పెంపొందించేందుకు నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటి సంరక్షించుకోవాలని అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సమీపంలో ఉన్న రైతు వేదిక ముందు ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనంపరిశుభ్రత కార్యక్రమంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటి సంరక్షించు కోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, ఎంపిడిఓ వరుణ్ తేజ, తహసీల్దార్ అద్దంకి సునీత, ఈజీఎస్ ఏపీఓ పర్వతాలు, మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్, ఎస్ఐ పుట్ట మహేష్, గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, తిప్పర్తి నరసింహారెడ్డి, ఉప సర్పంచ్ అంతటి శైలజ వెంకటయ్యగౌడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కృష్ణ, సింగిల్ విండో డైరెక్టర్ ఆలూరి శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ కుర్మా రెడ్డి, ఉమా పతి చారి, సుఖ జీవన్, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లయ్య, వార్డు సభ్యులు , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కృషితోనే గ్రామీణ రహదారుల అభివృద్ధి

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దురదృష్టి**


సమావేశంలో మాట్లాడుతున్న హరి కిషన్ నాయక్

**వెల్దండ, జూన్ 29 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలపై నిరంతర అభివృద్ధి పట్ల ఉన్న నిబద్ధతతోనే నియోజకవర్గ రహదారి అభివృద్ధి నిధులు మంజూరు సాధ్యమైందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరి కిషన్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోతిలాల్‌నాయక్ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్‌తో కలిసి హరికిషన్‌నాయక్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక కృషి చొరవతోనే హెచ్ఏఎం మొదటి దశలో నియోజకవర్గానికి భారీ స్థాయిల అభివృద్ధి పనులు మంజూరయ్యాయన్నారు. వెల్దండ మండలంలోని రాఘాయిపల్లి, చౌదరిపల్లి, కుప్పగండ్ల 8.5 కిలోమీటర్లు, వెల్దండ నుండి అంకమోని కుంట, చల్లపల్లి 12 కిలోమీటర్లు, పోతేపల్లి టు బొల్లంపల్లి, గోకారం టు పోతేపల్లి, ఎర్రవెల్లి గ్రామాల పరిధిలో నిధులు మంజూరయ్యాయన్నారు. ఎన్నో సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోని రహదారులను ఆధునిక ప్రమాణాలతో పునర్నిర్మించేందుకు గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల అనుసంధానం మరింత మెరుగుపడి ప్రజలకు సురక్షితమైన ప్రయాణ వసతులు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితోనే నియోజకవర్గం అని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సమావేశంలో ఎండి.హమీద్, రషీద్, శ్రీనివాస్‌యాదవ్, మాజీ సర్పంచ్ రామచంద్రయ్య తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు ఇవ్వాలి


పాఠశాల తనిఖీ చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

**నాగర్‌కర్నూల్, జూన్ 29 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో పూర్తిస్థాయి వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారా సింగ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ పాఠశాలలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తారా సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఇంకా 10 శాతం పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు ఇవ్వలేదని వారు అన్నారు. ఆరవ తరగతి ఎనిమిదవ తరగతి హింది పాఠ్యపుస్తకాలు అదే విధంగా విద్యార్థులకు దుస్తులు తక్షణమే పంపిణీ చేయాలని వారు అన్నారు. విద్యార్థులకు కనీసం సరిపోను బట్ట ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వట్లేదని వారు మండిపడ్డారు. ఒక విద్యార్థికి ఒక జతకు కొట్టుకొని 33 రూపాయలు మాత్రమే ఇవ్వడం వల్ల బట్టలు కుట్టడానికి ఎవ్వరు ముందుకు రావట్లేదని వారు ప్రభుత్వాన్ని విమర్శించారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో బాత్రూములు మరుగుదొడ్లు లేక విద్యార్థులు అనేక ఇబ్బందుల గురవుతున్నారని వారన్నారు. తక్షణమే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సరిపోయే మరుగుదొడ్లు బాత్రూంలో నిర్మించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివ ప్రసాద్, శ్రీనివాసులు, రవీందర్, మనోజ్, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ చావిడి వద్ద ఏరువాక పౌర్ణమి పండుగ

**ఘనంగా సాంప్రదాయ ఎద్దుల ఊరేగింపు వేడుక**


ఎద్దుల ఊరేగింపు వేడుకలో
వివిధ గ్రామాల ప్రజలు, మహిళలు, యువకులు

**కెటిదొడ్డి జూన్ 29, ప్రభాతవార్త:** మండల కేంద్రములో సోమవారం సాయంత్రం ఏరువాక పౌర్ణమి పండుగ సందర్భంగా స్తంభాలకు ఈత తాడు కట్టి ఎద్దులతో వైభవంగా ప్రదర్శనభారీగా తరలివచ్చిన గ్రామస్తులు, రైతాంగం గ్రామ సంస్కృతి, పురాతన వ్యవసాయ సాంప్రదాయాలను ప్రతిబింబించేలా కెటిదొడ్డి గ్రామ చావిడి వద్ద ఎద్దుల ఊరేగింపు వేడుకను గ్రామస్తులు అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. సాంప్రదాయం ప్రకారం... గ్రామ చావిడి సమీపంలో ఉన్న స్తంభాలకు ఈత తాడును గట్టిగా కట్టి, ఆ తాడు ఆధారంగా ప్రత్యేకంగా అలంకరించిన ఎద్దులతో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎద్దుల బలాన్ని, వాటి నైపుణ్యాన్ని ప్రదర్శించేలా సాగిన ఈ సాంప్రదాయ క్రతువు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. గ్రామానికి శుభం కలగాలని, వ్యవసాయం సరుగా సాగాలని కాంక్షిస్తూ ఏటా ఈ తరహా వేడుకలను నిర్వహించడం ఇక్కడి ఆనవాయితీగా వస్తోంది అని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. నేటి యాంత్రిక యుగంలో అంతరించిపోతున్న ఇలాంటి గ్రామీణ సంస్కృతిని, క్రీడలను కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఎంతైనా ఉందని వారు అన్నారు. మన పూర్వీకుల నాటి ఆచారాలను పునరుద్ధరించుకుంటూ, ఐకమత్యంతో పండుగలను జరుపుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని పార్టీల నాయకులు కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రజలు, మహిళలు, యువకులు తదితరులు ఉన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ**

**అచ్చంపేట, జూన్,29 ప్రభాతవార్త:** పట్టణ అభివృద్దే లక్ష్యంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ అన్నారు. పట్టణ ప్రణాళిక అభివృద్ధిలో భాగంగా సోమవారం పట్టణంలోని 9వ వార్డులో సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది. కాలనీలో పర్యటించి కాలని ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీవాసులు తాగునీరు, రహదారులు, డ్రైనేజీ తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని ప్రాధాన్యతతో పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మురళి, ఏఈ రాజు, గోపాల్ రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ..

**వెల్దండ, జూన్ 29 ప్రభాతవార్త:** నేరస్తులను గుర్తించడంలో సీసీ కెమెరా ఎంతో దోహదపడతాయని సీఐ రఘువీర్ రెడ్డి అన్నారు. వెల్దండ మండలంలోని పోచమ్మ గడ్డ తండా, దుబ్బ తాండలో సోమవారం శ్రీను నాయక్ అందజేసిన ఒక లక్ష రూపాయలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గ్రామ సర్పంచ్ మహిపాల్ నాయక్, ఎస్ఐ యుగంధర్ రెడ్డితో కలిసి సిఐ రఘువీర్ రెడ్డిలు సీసీ కెమెరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజల స్వచ్ఛందంగా ముందుకు రావాలని, సీసీ కెమెరాలతో అసాంఘిక శక్తులను అరికట్టడంలో ఎంత ఉపయోగపడతాయని అన్నారు. అదేవిధంగా ఐఐటిలో సీట్లు పొందిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చంద్రకళ గోపాల్, పంచాయతీ కార్యదర్శి నవనీత, వార్డు సభ్యులు శ్రీరామ్, జ్యోతి, రేఖ, నిర్మల, పాండుతో పాటు గ్రామస్తులు ఉన్నారు.

## ఘనంగా ఏరువాక పౌర్ణమి సంబరాలు

**గ్రామ గ్రామాన రైతన్నల సంబరాలు**

**చిన్న చింతకుంట, జూన్ 29 ప్రభాతవార్త :** ఏరువాక పౌర్ణమి పండుగను మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఏరువాక పౌర్ణమి రోజున రైతన్నలు తమ వ్యవసాయ పొలంలో పూజలు నిర్వహించి వ్యవసాయానికి ఉపయోగపడే మూగజీవాలైన ఎద్దులను రంగురంగులతో అలంకరించి ఎద్దుల చావడిని అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాలలో రైతన్న గృహాలలో తమ ఇష్టదైవాలకు తీపి పదార్థాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం గ్రామాల్లోని ఏరువాక పౌర్ణమి సందర్భంగా గ్రామాలలో ప్రధాన వీధుల గుండా అందంగా అలంకరించిన ఎద్దులను ఊరేగుతూ ప్రధాన కూడలిలో ఏరువాకతాడును ఏర్పాటు చేసిన ఏరువాకతాడును తెంపేందుకు రైతులు తమ ఎద్దులతో పోటీ పడ్డారు. ఈ పోటీలో గెలుపొందిన ఎద్దుల జతకు బహుమతులను అందజేశారు. సకాలంలో వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండాలని భూతల్లిని వేడుకుంటూనే వరుణదేవుడు కరుణించాలని భగవంతుని కోరినట్లు రైతులు తెలిపారు. పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు.

## మృతుని కుటుంబానికి
## ఆర్థిక సాయం, బియ్యం అందజేత

**లింగాల, జూన్ 29, ప్రభాతవార్త :** మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామానికి చెందిన నిమ్మల శివ ఇటీవల మృతి చెందారు. సోమవారం మృతుని కుటుంబానికి మాజీ సర్పంచ్ రవీందర్ నేతృత్వంలోని మనం మన బాధ్యత ఆధ్వర్యంలో రూ. 5 వేలు నగదు అదేవిదంగా 25 కిలోల బియ్యాన్ని 8 వ వార్డు సభ్యులు నెల్లికుదురు పద్మ నరేష్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మృతుని కుటుంబానికి తమ వంతు సహాయంగా ఈ ఆర్థిక సాయాన్ని అందించామని, భవిష్యత్తులో కూడా బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో నరేష్, బిజెపి మండల పార్టీ మాజీ అధ్యక్షులు యాదగిరి సలేశ్వరం, శేఖర్ పెబ్బేటి, తిరుపతి శారదరాముడు రాజు గౌడ్, కొరుపాల మహేష్, అశోక్ శ్రీశైలం, శ్రీనివాసులు, బాలస్వామి, పి.రాజు, మిద్దెల బాలరాజు, బలీశ్వర్, రాజు, సలేశ్వరం, రామకృష్ణ, సీతారాం, నవీన్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం



**నారాయణపేట, జూన్ 29 ప్రభాతవార్త :** ఉట్కూర్ గ్రామానికి చెందిన బెస్త రేణుక నర్సింహా దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిలో గృహప్రవేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ పెద్దల సమక్షంలో వేద మంత్రోచ్ఛారణల మధ్య గృహప్రవేశ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మొగతి మ్మకోళ్ల రేణుక భారత్, ఉపసర్పంచ్ రమేష్, పంచాయతీ కార్య దర్శి శ్రీనివాసులు, వార్డు సభ్యులు, సందపురం సువర్ణ రవి కొక్కు శంకర్ గ్రామ ప్రముఖులు పాల్గొని రేణుక - నర్సింహా దంపతు లకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ గృహ పథకం ద్వారా స్వంత ఇంటి కల సాకారం కావడం ఎంతో ఆనందంగా ఉందని గృహ యజమానులు తెలిపారు. నూతన గృహం సుఖశాంతులు, ఐశ్వర్యాలతో నిండాలని ప్రజాప్రతినిధు లు ఆకాంక్షించారు.

## పెబ్బేర్ జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు బోల్తా..

**మొదటి పేజీ తరువాయి భాగం..**


మృతుడు ఏఈ శివప్రసాద్ (ఫైల్)

ఆర్తనాదాలతో మారిన వేళ, ఆయన ఏమాత్రం తడబడకుండా రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారు. బస్సులో చిక్కుకుపోయిన ప్రయాణికులను సురక్షితంగా బయటకుతీయడంలో ఆయనే స్వయంగా రంగంలోకి దిగారు. చికిత్సకు ఏర్పాట్లు: క్షతగాత్రులను 108 అంబులెన్స్‌ల ద్వారా వెంటనే వనపర్తి, పెబ్బేరు ప్రభుత్వ ఆసుపత్రికి, తీవ్రంగా గాయపడిన 8 మందిని కర్నూలు ఆసుపత్రికి తరలించేలా దగ్గరుండి ఏర్పాట్లు చూశారు.
**రవాణా క్రమబద్ధీకరణ:** ప్రమాదం కారణంగా ఎన్‌హెచ్ 44పై ట్రాఫిక్ నిలిచిపోకుండా ప్రత్యామ్నా య చర్యలు చేపట్టారు. బాధితుల వస్తు వులకు భద్రత..ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు ప్రయాణికుల సామాన్లు, విలువైన వస్తువులు పోతుంటాయి. కానీ, ఎస్సై వెంకటే ష్ గౌడ్ అక్కడక్కడా పడిపోయిన ప్రయాణికుల బ్యాగులు, మొబై ల్స్, ఇతర విలువైన వస్తువులను భద్రపరిచి, వాటిని తిరిగి బాధితులకు అప్పగించేలా చూశారు. ప్రమాదం జరిగినప్పటి నుంచి బాధితులకు రక్షణగా ఉన్న స్థానిక ఎస్సై వెంకటేష్ గౌడ్ ను పలువురు ప్రశంసించారు. దీంతోపాటు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు హైదరాబాద్ నుండి కర్నూలు వెళుతున్నారు. ఈ ప్రమాదం జరగడంతో ఆయన కారు దిగి బాధితులకు అండగా నిలిచి మెరుగైన చికిత్సకు సహకారం అందించారు. ప్రమాదం పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మూఢనమ్మకంతో దారుణ హత్య..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఆంజనేయులును అదుపులోకి తీసుకొని విచారించగా, నిందితుడు కొంతకాలంగా అనారోగ్యంతో, కుటుంబ సమస్యలతో సతమతమ వుతున్నాడని, తన కష్టాలకు కారణం యాదయ్యేనని, అతను గ్రామంలో చేతబడి వంటి మూఢన మ్మకాలతో తనను ఇబ్బంది పెడుతున్నాడనే అక్కసుతో నింది తుడు ఈ దారుణానికి పాల్పడిన ట్లు తెలిపారు. ఈ నెల 26న దారి కాచి యాదయ్యను కత్తితో పొడిచి చంపినట్లు పోలీసుల విచారణలో అంగీకరించాడన్నారు. నిందితుడి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, బైక్, మొబైల్ ను స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్ తరలించినట్లు పేర్కొన్నారు. హత్య కేసును చేధించిన కల్వకుర్తి సీఐ భీమ్ కుమార్, ఎస్ఐ ఎన్. రమాదేవి, పోలీసు సిబ్బంది (చిరంజీవి, నజీరుద్దీన్, లింగం గౌడ్, శ్రవణ్, హర్ష, కృష్ణ)ను కల్వకుర్తి డీఎస్పీ సాయిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్‌లు ప్రత్యేకంగా అభినందించారు.

### ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక

## అమలులో జిల్లా పనితీరు ప్రశంసనీయం

**మొదటి పేజీ తరువాయి భాగం..**

సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ కూడా అన్ని కార్యక్రమాలకు అవసరమైన సమన్వయం, శాంతిభద్రతల ను సమర్థంగా నిర్వహించడం వల్ల అభివృద్ధి కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయని అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అమలు తీరు ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలిచేలా ఉందని ఆయన తెలిపారు. ప్రతి శాఖ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాయని చెప్పారు. ముఖ్యంగా జిల్లా కలెక్టర్ నాయకత్వంలో అధికారులు గ్రామస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వెంటనే పరిష్కార చర్యలు చేపడుతున్న తీరు అభినందనీయమన్నారు. ఈరోజు వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామాన్ని సందర్శించి అక్కడ నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ప్రత్యక్షంగా పరిశీలించినట్లు షఫీయుల్లా తెలిపారు. గృహ నిర్మాణ పనుల నాణ్యతను పరిశీలించడంతో పాటు లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నామని, సొంత ఇంటి కల సాకారమవుతున్న ఆనందంతో లబ్ధిదారులు వ్యక్తం చేసిన సంతోషం తనను ఎంతో ఆనందానికి గురి చేసిందన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, పారదర్శక పాలనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని షఫీయుల్లా అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రతి ప్రభుత్వ శాఖ జవాబుదారీతనంతో పనిచేసి ప్రజల జీవితాల్లో ప్రత్యక్ష మార్పు తీసుకురావాలన్నదే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్, అన్ని శాఖల అధికారులు ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ మీడియా సమావేశంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ్ సహాయం, జిల్లా స్థాయి అధికారులు, ప్రజా సంబంధాల శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బొట్టు పెట్టి... హారతి పట్టి..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

సదుపాయాలు కల్పించడమే మాప్రాధాన్యత అని పేర్కొన్నారు. మండలంలోని దాచక్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలనలో పది అన్ని వ్యవస్థలు ధ్వంసం చేశారని ఆరోపించారు. పేద ప్రజలకు హామీలు ఇచ్చి ఏఒక్క హామీ నిలబెట్టుకోలేదని, డబ్బాలాం టి ఇందిరమ్మ ఇండ్లు వద్దు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని ప్రజలను నమ్మించి దగా చేశారని ఆయన మండిపడ్డారు. అయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలనే ఉద్దేశంతో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. స్థానిక యువతకు ఉపాధి కల్పననే లక్ష్యంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మహబూబ్ నగర్ నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, గ్రామ సర్పంచ్ శ్రీలత, ఉప సర్పంచ్ శంకర్ నాయక్, డిసిసి ఉపాధ్యక్షులు వేముల కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టంకర కృష్ణయ్య యాదవ్, లింగం నాయక్, శంకర్ నాయక్, విజయ్ నాయక్, అబ్దుల్ హక్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ ఆఫీస్ సిస్టమ్..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

ఉపయోగకరమైనదని అంతేకాకుండా పర్యావరణ హితంతో కూడుకున్నదని వివరించారు. ఏ ఫైలు ఏ అధికారి, సిబ్బంది దగ్గర పెండింగ్‌లో ఉన్నది ఎన్ని రోజుల నుండి పెండింగ్‌లో ఉన్నది అనే విషయాలు ఈ ఆఫీస్ ద్వారా సులువుగా తెలిసిపోతుందని చెప్పారు. జిల్లాలో జవాబుదారీతనం, పారదర్శకతతో ఫైళ్ళ క్లియరెన్స్ కోసం జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఈ ఆఫీస్ ఏవిధంగా చేయాలో నేర్చుకొని జులై 1 నుంచి ఈ ఆఫీస్ కు మారాలని తన వద్దకు ఫిజికల్‌గా వచ్చే ఏ ఫైలు ఆమోదించబడదని స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్. ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రెండు చుక్కలు శ్రీరామ రక్ష

**మొదటి పేజీ తరువాయి భాగం..**

పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి విధిగా పోలియో చుక్కలు వేయించి, పోలి యో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు సహకరించాలని పిలు పునిచ్చారు. తల్లిదండ్రులు ఎలాంటి నిరక్ష్యం చేయకుండా తమ పిల్లల ను సమీప పోలియో కేంద్రాలకు తీసుకెళ్లి పోలియో చుక్కలు వేయిం చాలని కోరారు. ఆరోగ్యవంతమైన భావితరాల కోసం ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం అందరి సామాజిక బాధ్యతని ఎమ్మె ల్యే పేర్కొన్నారు. రెండు చుక్కల జీవంపిల్లల జీవితానికి శ్రీరామరక్ష అని పేర్కొంటూ, ఐదు సంవత్సరాల లోపు ఉన్న ప్రతి ఒక్క చిన్నారికి ఈ ఉచిత పోలియో చుక్కలను వేయించి, మన దేశాన్ని పోలియో రహిత భారతంగా మార్చడంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అరుణ్ కుమార్ రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఫారుక్ అలీ, అంజన్ కుమార్ రెడ్డి, జవహర్, ప్రధాన కార్యదర్శి కిషన్ రావు, మహబూబ్నగర్ డిఎంహెచ్వో, డా.శరత్ చంద్ర, ఎంపీడీవో శ్రీనివాసరావు, తాహసిల్దార్ హర్షద్ అలీ, ఆశా కార్యకర్తలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### టౌన్ ప్లానింగ్ అధికారులకు

## షోకాజ్ నోటీసులు..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

సోమవారం వార్తా ప్రతినిధులు కమిషనర్ ను సంప్రదించి పలు అంశాలపై వివరణ కోరడంతో టౌన్ ప్లానింగ్ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న యజమానులకు నోటీసులు జారీ చేశామని అధికారులు చెబుతున్న, పనులను నిలుపుదల మాత్రం చేయట్లేదు. గతంలో మున్సిపల్ అధికారులు యజమానులకు నోటీసులతో సరిపెడుతున్నప్పటికీ యజమానులు తేలికగా తీసుకొని మళ్ళీ పనులు పునః ప్రారంభిస్తున్నారు. నోటీసులు అంటే యజమానులకు సాదాసీదా పరపాటి గా మారింది. శాఖపరమైన చర్యలు తీసుకోవడంలో అధికారులు ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది.

**సమాచారం అడిగితే అధికారులు దాటి వేత...**

వనపర్తి బల్దియా లో అధికారులను సమాచారం అడిగితే దాటవేస్తూ.. కాలయాపన చేస్తున్నారు. పత్రికా ప్రతినిధులు సమాచారం అడుగుతే అధికారులు ఆర్టిఏ ద్వారా సమాచారం తీసుకోవాలంటూ బదులు ఇస్తుండడం గమనార్హం.

### ఎన్యూమరేషన్ పత్రాలు పూరించి ఇవ్వకపోతే

# ఓటరు జాబితాలో పేర్లు ఉండవు

**నారాయణ పేట జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక**


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక

**నారాయణ పేట, జూన్ 29 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా లో ఓటరు జాబితాల రిచ్చితత్వం కోసం చేపట్టనున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా కొనసాగుతున్న ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక కోరారు. జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు) ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల వివరాలను ధృవీకరించనున్నట్లు తెలిపారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తామని, ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. అనంతరం సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాలను పరిష్కరించి అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని వివరించారు. ఈ నెల 25 నుంచి బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్నారని, కొత్త ఓటర్ల నమోదుకు ఫారం6 అందజేస్తున్నారని తెలిపారు. ఓటర్లు ఎన్యూమరేషన్ పత్రాలను పూర్తిగా పూరించి తిరిగి బీఎల్వోలకు అందజేయాలని సూచించారు ఎన్యూమరేషన్ ఫారాలు పూరించి బీఎల్వోలకు అందిస్తేనే ఓటరు జాబితాలో పేర్లు ఉంటాయని, అందించకపోతే ఓటరు జాబితాలో పేర్లు ఉండవని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇక నుంచి ప్రతి మంగళవారం మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తామని, అనంతరం ఏఈఆర్వో స్థాయిలో కూడా సమావేశాలు ఉంటాయని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ బూత్ స్థాయి ఏజెంట్లు బీఎల్వోలకు సహకరించేలా చూడాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఉన్న అనుమానాల నివృత్తి కోసం హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేస్తామని, ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత అన్ మ్యాపింగ్ కేసుల విచారణ చేపడతామని తెలిపారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగించబడదని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని పేర్కొన్నారు

ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డీఆర్ఓ రాజేశ్వరి, సీ సెక్షన్ అధికారిణి జయసుధ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రజావాణికి 23 ఫిర్యాదులు ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి మొత్తం 23 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్‌తో పాటు డీఆర్ఓలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమంలో ఆర్యవైశ్యులు ముందంజ

- నూతన కార్యవర్గం ఐక్యంగా పని చేయాలి..
- వాసవి మాత ఆశీస్సులతో మరింత అభివృద్ధి చెందాలి
- అట్టహాసంగా ఆర్యవైశ్య సంఘం, వివిధ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం

నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ళ రాజేష్‌రెడ్డి,


ఎమ్మెల్యే, కార్పొరేషన్ చైర్మన్, వనపర్తి మున్సిపల్ చైర్మన్‌లను సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 29, ప్రభాతవార్త:** సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సమాజ సంఘాలు ముందంజలో ఉంటాయని, వారి సేవలు అభినందనీయమని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ళ రాజేష్ రెడ్డి పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ నూతన పట్టణ ఆర్యవైశ్య సంఘాల కార్యవర్గాల ప్రమాణ స్వీకార మహోత్సవం పట్టాహాసంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర ఆర్యవైశ్య కార్పోరేషన్ చైర్మన్ కల్వ సుజాతతో కలిసి ఎమ్మెల్యే కూచకుళ్ళ రాజేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఆర్యవైశ్య మహాసభ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు బచ్చురామకృష్ణ అధ్యక్షతన ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యా సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘాల పాత్ర అభినందనీయమని చెప్పారు. నూతన కార్యవర్గం ఐక్యంగా పనిచేసే సంఘం అభివృద్ధికి మరింత కృషి చేయాలని సూచించారు. వాసవి మాత ఆశీస్సులతో సంఘాలు మరింత అభివృద్ధి చెందాలని అకాంక్షించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బిల్లకంటిహరిబాబు, పట్టణ యువజన సంఘం, పట్టణ విద్యా కమిటీ వాసవి దేవాలయ నూతన కార్యవర్గాల ప్రమాణస్వీకారం చేయించారు. పట్టణ మహిళా సంఘం కార్యవర్గాన్ని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, వనపర్తి మున్సిపల్ చైర్మన్ మిడిదొడ్డి మాధవిలు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన అన్ని కమిటీ సభ్యుల ను ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే, కార్పొరేషన్ చైర్మన్, వనపర్తి మున్సిపల్ చైర్మన్‌లను నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్యమహాసభ అధ్యక్షులు బచ్చురామకృష్ణ శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకులు, శ్రీ మల్లిఖార్జున సత్రం చైర్మన్ మిడిదొడ్డి శ్యామ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, మున్సిపల్ చైర్మన్ తీగల సురేంద్ర కుమార్, వైస్ చైర్మన్ బాదాం రమేష్, పిఆర్వో మిర్యాల రాజయ్య, కౌన్సిలర్లు ఆర్యవైశ్య నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

## గత పాలకులు అభివృద్ధి చేయకుండా గాలికి వదిలేశారు

**ఎన్నో సంవత్సరాల కళ త్వరలోనే నెరవేరనున్నది: దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**

**దేవరకద్ర, జూన్ 29 ప్రభాతవార్త:** గత పాలకులు దేవరకద్ర ను అభివృద్ధి చేయకుండా గాలికి వదిలేసి, దేవరకద్ర ను రెండు ముక్కలు చేసి, అభివృద్ధికి తీవ్ర ఆటంకం కలిగించారని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి విమర్శలు చేశారు. సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అధికారులతో కలిసి కోర్టు ఏర్పాటు చేయనున్న భవనం ను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో కోర్టు ఏర్పాటు చేయాలని ఎన్నో సంవత్సరాల కల త్వరలోనే నెరవేరనున్నది అన్నారు. దేవరకద్ర, కౌకుంట్ల, చిన్నచింతకుంట, మండలాలకు చెందిన ప్రజలు కేసుల విషయంలో ఆత్మకూరుకు వెళ్ళవలసిన వచ్చేది. చాలా దూరం కావడంతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కోర్టు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయడంతో కోర్టు మంజూరు కావడం జరిగిందన్నారు. జులై రెండవ తేదీన కోర్టును ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రారంభించిన రోజే ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ప్రారంభోత్సవానికి హాజరయ్యే అతిథులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. భద్రత, పార్కింగ్, తాగునీటి సౌకర్యం, పరిశుభ్రత తో పాటు ఇతర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రజలకు మెరుగైన న్యాయ సేవలు అందించేందుకు కట్టుబడి ఉందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, అంజన్ కుమార్ రెడ్డి, జవహర్, పట్టణ అధ్యక్షులు ఫారుక్ అలీ, ఎంపీటీవో శ్రీనివాసరావు, తహసిల్దార్ హర్షద్ అలీ, కోర్ట్ అధికారులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## జులై 1 కలెక్టరేట్ ముట్టడి..

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్...**

**నాగర్ కర్నూల్, జులై 29 ప్రభాతవార్త :** నిరుపేదలందరికీ ఇండ్లు ఇంటి స్థలాలు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఎం పార్టీల ఆధ్వర్యంలో జులై ఒకటో తేదీన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం ఉంటుందని సిపిఐ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనవసరమైన ఆర్భాటాలకు ప్రాధాన్య ఇస్తుంది కానీ పేద ప్రజల అసలైన సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టలేదని విమర్శించారు. రాష్ట్రంలో కొన్ని లక్షల కుటుంబాలు జిల్లాలో కొన్ని వేల కుటుంబాలు నేటికీ సొంత ఇల్లు లేక కనీసం ఇంటి జాగా కూడా లేక అద్దెపూరి గురుసెల్లో లేదా అద్దె ఇంట్లో జీవితం గడుపుతూ విపరీతంగా పెరిగిన ఇంటి అద్దాలను చెల్లించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న అతిపెద్ద ప్రధాన సమస్య ఇది అని దీనిపై దృష్టి కేంద్రీకరించాలని డిమాండ్ చేస్తూ ఈ ఆందోళన కార్యక్రమానికి పిలుపునిస్తున్నామన్నారు. జిల్లాలో ఉన్న నిరుపేదలందరూ జూలై ఒకటో తేదీన కలెక్టరేట్ దగ్గరికి పెద్ద ఎత్తున తరలిరావాలని తమ హక్కుల సాధన కోసం జరిగే పోరాటంలో మీరు ముందు భాగంలో ఉండాలని ఫయాజ్ పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ముందు ఇంటి జాగా ఆ తర్వాత ఇల్లు నిర్మించుకునేలా సౌకర్యం కల్పించేంతవరకు వామపక్ష పార్టీలు పెద్ద ఎత్తున ప్రజా పోరాటాల నిర్వహిస్తాయని ఆయన తెలియజేశారు. ఉదయం 11 గంటలకు నాగర్ కర్నూల్ కొల్లాపూర్ నుండి కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా వెళ్లి నిరసన ఆందోళన నిర్వహిస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం బాల నరసింహ హాజరవుతారని తెలిపారు.

## అర్హులైన జర్నలిస్టులకు వెంటనే అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలి

**రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్ట్ లకు ఉచిత ప్రయాణం కల్పించాలి**

**కొల్లాపూర్, జూన్ 29, ప్రభాతవార్త :** నియోజకవర్గంలో వివిధ పత్రికలలో మరియు మీడియా చానల్స్ లో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు వెంటనే నూతన అక్రిడేషన్ కార్డులను మంజూరు చేయాలని కొల్లాపూర్ నియోజక వర్గ టియుడబ్ల్యూజే ఐజేయు నియోజకవర్గ అధ్యక్షుడు మాలే రాజేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బోల్గంవెంకటస్వామి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు 252 జీఓ తో జర్నలిస్టులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నియోజకవర్గ రిపోర్టర్లకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు వన్ బై థర్డ్ బస్సు పాస్ రవాణా సౌకర్యం ఉండేది. ఇప్పుడు కొత్తగా తీసుకొచ్చిన జీఓ తో మండలంలో పనిచేసే జర్నలిస్టులకు నియోజకవర్గ కేంద్రంలో పనిచేసే జర్నలిస్టులకు ఒకే మాదిరిగా అధికారులు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వరకే పరిమితం చేస్తూ బస్సు పాసులు జారీ చేస్తున్నారు. ప్రజా శ్రేయస్సు కోసం ఇటు అధికారులకు ప్రజా ప్రతినిధులకు వారధిగా ఉంటూ పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లు స్పందించి జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వసతి కల్పించిందని అలాగే అర్హత కలిగిన అక్రిడేషన్ కలిగిన వర్కింగ్ జర్నలిస్టులకు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సులలో అన్ని సర్వీసులలో ఉచిత ప్రయాణం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఎన్యూమరేషన్ ఫారం పద్ధతి ప్రకారం పూరించాలి...

**జిల్లాలో 66 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి : జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, జూన్ 29, ప్రభాతవార్త :** ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై రాష్ట్ర ప్రధాన ఎలెక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికలఅధికారి పలుసూచనలు ఇవ్వడంతో పాటు జిల్లాలలో జరుగుచున్న ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వివరిస్తూ సోమవారం మధ్యాహ్నం నాటికి జిల్లాలో 275570 ఓటర్లకు గాను 182327 ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను ఇంటింటికి వెళ్లి బిఎల్ఓల ద్వారా పంపిణీ చేయడం పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారం తీసుకున్న ఓటర్లందరూ ఎన్యూమరేషన్ ఫారం పూరించి తిరగి బిఎల్ఒలకు ఇవ్వాలని సూచించారు. ఇప్పటికే ఓటరు జాబితాలో పేరు ఉండి ఓటు హక్కు కలిగి ఉన్నవారు సైతం ప్రస్తుతం బూత్ లెవల్ అధికారుల ద్వారా ఇంటింటికి వచ్చి ఇచ్చిన రెండు జతల ఎన్యూమరేషన్ ఫారం ను ఎన్నికల నిబంధనల ప్రకారం తప్పులు లేకుండా పూరించి సంతకం చేసి ఇస్తేనే కొత్తగా వచ్చే ఓటరు జాబితాలో పేరు ఉంటుందని లేకుంటే జాబితాలో పేరు గల్లంతవుతుందని తెలియజేశారు. వనపర్తి జిల్లాలోని ప్రతి ఓటరు తన ఎన్యూమరేషన్ ఫారంను పూరించి బిఎల్ఓకు తిరిగి ఇవ్వాల్సి ఉంటుందని కలెక్టర్ తెలియజేశారు.

### భక్తిశ్రద్ధలతో ధ్వజ స్తంభ

## పునః ప్రతిష్టాపన

**బిజినేపల్లి, జూన్ 29 ప్రభాతవార్త:** పాలెం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలోని శ్రీ రామబ్రహ్మేశ్వర స్వామి వారి ధ్వజ స్తంభ పునః ప్రతిష్టాపన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం వేద బ్రాహ్మణ పట్నం సురేష్ శర్మ మంత్రోచ్చారణ మధ్య యంత్ర సంస్కారం, మూల మంత్ర జపానుష్ఠానము, మహాస్నపనం, ఆవాహిత హోమాలు, గర్త సంస్కారం, రత్నా న్యాసం, బీజా న్యాసం, ప్రతిష్ఠాన హోమము, యంత్ర ప్రతిష్ఠ, ధ్వజ స్తంభం ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, కళాణ్యాసం, బలిహరణ, కుంభ దృష్ఠినకిత్రోన్మిలనం, పూర్ణాహుతి, కలషోధ్వాసన, ప్రథమ ఆరాధన, మంగళ హారతి, అవబృధ స్నానం, కుంభాభిషేకం, మార్జన, వేద ఆశీర్వచనం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు చక్రపాణి శర్మ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన దాతలు మనుసాని జయలక్ష్మి, వెంకటరమణ మనుసాని పద్మజ, శంకర్ లింగం, ధర్మకర్త మనుసాని విష్ణుమూర్తి ,సర్పంచ్ బోనాసి రామకృష్ణ దంపతులు, మాజీ ఎంపీపీ పుప్పాల సుమలత శ్రీనివాస్‌గౌడ్, ఉపసర్పంచ్ శ్రీనివాసులు, గాడి సురేందర్ సొప్పరి బాలస్వామి భక్త బృందం గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.

## సొంత నిధులతో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ

**సర్పంచ్ బండగిరి ప్రసాద్ యాదవ్‌ను అభినందించిన గ్రామస్తులు**


విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేస్తున్న దృశ్యం

**జడ్చర్ల, జూన్ 29, ప్రభాతవార్త:** జడ్చర్ల మండలంలోని గంగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించే ఉద్దేశంతో గ్రామ సర్పంచ్ బండగిరి ప్రసాద్ యాదవ్ సోమవారం తన సొంత నిధులతో విద్యార్థులకు పాఠశాల బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, విద్యే సమాజ అభివృద్ధికి బలమైన పునాది అని, గ్రామంలోని ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి మంచి భవిష్యత్తును నిర్మించుకో వాలని ఆకాంక్షి ంచారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

## ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన సర్పంచి కల్పనా శ్రీధర్‌రెడ్డి

**భూత్పూర్, జూన్ 29, ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం తాటికొండ గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి ని సోమవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ కేసిరెడ్డి శ్రీని వాస్‌రెడ్డి సమక్షంలో సర్పంచి కల్పనా శ్రీధర్‌రెడ్డి ప్రారంభిం చారు. లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్ర మంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ కేసిరెడ్డి శ్రీనివా స్‌రెడ్డి, తాటికొండ గ్రామ ఉపసర్పంచి రాములుతో పాటు కాంగ్రె స్ నాయకులు కిట్టురెడ్డి, ఎర్రవాపు నర్సింహులు, గ్రామకమిటీ అధ్యక్షుడు ఎల్పటి వెంకటేష్, మాజీ ఎంపీటీసీ సాయిలు, శేరి రవీందర్‌రెడ్డి, పట్ల అంజనేయులు, బొల్లు అంజనేయులు, సయ్యద్‌పాషా, శ్రీధర్‌గౌడ్, జింక శ్రీను, తాటిపర్తి రఘు, బాలు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్‌పై బూత్ ఇంచార్జీలతో మాజీ ఎమ్మెల్యే ఆల ప్రత్యేక సమావేశం

**భూత్పూర్, జూన్ 29, ప్రభాతవార్త :** ఓటర్ల సవరణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్‌పై మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సోమవారం భూత్పూర్ మండలం అన్నాసాగర్ లో వెల్కిచర్ల, భట్టుపల్లి, ఇప్పలపల్లి గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పోలింగ్ బూత్ ఇంచార్జీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పార్టీ సభ్యత్వ నమోదు, సంస్థాగత నిర్మాణంపై పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే ఆల దశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో భూత్పూర్ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, అన్నాసాగర్ సర్పంచి ఆల శ్రీకాంత్‌రెడ్డితో పాటు నాయకులు సత్తూర్ నారాయణ గౌడ్, మనెమోని సత్యనారాయణ, మాజీ ఎంపిపి సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్, మేకల సత్యనారాయణ, టి మురళిధర్‌గౌడ్, తూము శ్రీనివాస్‌రెడ్డి, మొల్గర నర్సింహులుగౌడ్, మొహ్మద్ సాధిక్, రాము రాథోడ్, గడ్డం రాములు, గొడుగు వెంకటరాజు, గొడుగు అంజనేయులు, శశిబాబు, ఎండి షాకీర్ తదితరులు పాల్గొన్నారు.